www.prajasakti.com

ప్రజాశక్తి

మంగళవారం 22 జులై 2025



వి.ఎస్. నిరంతర పోరాట యోధుడు

ప్రజాశక్తి-రాయచోటి అర్బన్

కమ్యూనిస్టు కురువృద్ధుడు, కేరళ మాజీ ముఖ్యమంత్రి వి.ఎస్.అచ్యుతానందన్ నిరంతర పోరాట యోధుడని సిపిఎం జిల్లా కన్వీనర్ పి.శ్రీనివాసులు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. విఎస్ మృతిపై సంతాపం వ్యక్తం చేశారు. పార్టీతో ఎనిమిదన్నర దశాబ్దాల అనుబంధం కలిగిన విఎస్ కేరళలో కమ్యూనిస్టు ఉద్యమ స్థిరత్వానికి ఎంతగానో కృషి చేశారని కొనియాడారు. సామాజిక న్యాయం పట్ల నిబద్ధత కలగిన వ్యక్తిగా గుర్తింపుపొందిన ఆయన కేరళ రాజకీయాల్లో చెరగని ముద్ర వేశారన్నారు. ఆయన మృతి పార్టీకి, కమ్యూనిస్టు ఉద్యమానికి తీరని లోటని పేర్కొన్నారు. విఎస్ అని ముద్దుగా పిలుచుకునే అచ్యు తానందన్ కేరళలో వివిధ పోరాటాలకు నేతృత్వం వహించడమే కాకుండా సమర్థవంతంగా నడిపించారని తెలిపారు. కేరళ అసెంబ్లీకి ఏడు పర్యాయాలు ఎన్నికయ్యారని, రెండు పర్యాయాలు ప్రతిపక్ష నేతగా పనిచేశారని, 2006-2011 మధ్య కేరళ ముఖ్యమంత్రిగా బాధ్యతలు నిర్వహించారని పేర్కొన్నారు. ముఖ్యమంత్రిగా ఆయన పదవీకాలంలో కార్మికుల సంక్షేమం కోసం అనేక చర్యలు చేపట్టారని వివరించారు.

భిక్షాటన చేస్తూ కార్మికుల నిరసన

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

పారిశుధ్య కార్మికులు చేస్తున్న నిరవధిక సమ్మెలో భాగంగా సోమవారం ఆరవ రోజు పురపాలక కార్యాలయం వద్ద కార్మికులు భిక్షాటన చేస్తూ నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు చిట్వేలి రవికుమార్ మాట్లాడుతూ పారిశుధ్య కార్మికులు ఇన్ని రోజులుగా సమ్మెలో పాల్గొంటుంటే ప్రభుత్వం స్పందించకపోవడం దారుణమన్నారు. గతంలో ప్రతిపక్షంలో ఉన్నప్పుడు టిడిపి మున్సిపల్ కార్మికుల అన్ని సమస్యలు పరిష్కరిస్తామని హామీ ఇచ్చి నేడు నిర్లక్ష్య ధోరణితో వ్యవహరిస్తుందని పేర్కొన్నారు. ప్రస్తుత సమాజంలో జీవనం సాగాలంటే నెలకు రూ.30 వేలు లేనిదే కుటుంబం గడవదని, పారిశుధ్య కార్మికులకు చాలీచాలని వేతనాలు ఇచ్చి ప్రభుత్వ సంక్షేమ పథకాలను దూరం చేయడం అన్యాయమని పేర్కొన్నారు. కార్మికుల సమస్యల పట్ల పురపాలక శాఖ మంత్రిని పలుమార్లు కలిసి విన్నవించుకున్నా ఫలితం లేదని ఆవేదన వెలిబుచ్చారు. డిమాండ్లు నెరవేర్చకపోతే రాష్ట్రవ్యాప్తంగా పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో మున్సిపల్ వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి పి.వి.రమణ, కోశాధికారి లక్ష్మీదేవి, ఓబయ్య, ప్రసాద్ రవిశంకర్, ఎం.రమణ, సాలయ్య, సునీత, బుజ్జమ్మ, ప్రమీల పాల్గొన్నారు.



రాజంపేట : బిక్షాటన చేస్తూ నిరసన తెలుపుతున్న మున్సిపల్ కార్మికులు

ఒంటికాలిపై నిల్చుని కార్మికుల నిరసన దీక్షలు

రాయచోటి అర్బన్: తాము ఎదుర్కొంటున్న సమస్యలను వెంటనే పరిష్కరించాలన్న డిమాండ్‌తో మున్సిపల్ కార్మికులు ఒంటికాలిపై నిల్చుని నిరసన దీక్షలు చేపట్టారు. సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎ.రామాంజులు ఆధ్వర్యంలో కార్మికులు నిర్వహిస్తున్న నిరవధిక దీక్షను కొనసాగించారు. ఈ సందర్భంగా రామాంజులు, కార్మిక సంఘం నేతలు శంకరయ్య, బి.వి.రమణ, చెన్నయ్య, రాంబాబు, అక్బర్ మాట్లాడుతూ కార్మికుల సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం ఎక్కడా లేని నిర్లక్ష్యాన్ని వహిస్తుండడం దుర్మార్గమన్నారు. పారిశుధ్య కార్మికులతో సమానంగా ఇంజినీరింగ్ కార్మికులకు వేతనాలు చెల్లించాలంటూ డిమాండ్ చేశారు. సంవత్సరాల తరబడి తక్కువ జీతంతో పాటు తమ శ్రమశక్తిని దోపిడి చేస్తుండడం తగదంటూ ఆవేదన వ్యక్తంచేశారు. పారిశుధ్య విభాగం డ్రైవర్లకు రూ.24,500ల జీతాలను చెల్లించి ఆదుకోవాలంటూ కోరారు. కార్మికు లను ఆప్కాస్ కింద కొనసాగిస్తూనే 8నెలల పెండింగ్ పిఎఫ్ బకాయిలను చెల్లించాలంటూ డిమాండ్ చేశారు. పనిగంటల పెంపు నిర్ణయాన్ని వెంటనే విరమించుకోవాలన్నారు. విరమణ వయస్సును 62 ఏళ్లకు పెంచాలన్నారు. కార్యక్రమంలో నాయకులు రెడ్డిప్రసాద్‌తో పాటు కార్మికులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.



రాయచోటి: ఒంటికాలుపై నిల్చుని నిరసన దీక్షలు చేపట్టిన మున్సిపల్ కార్మికులు

కార్మికుల సమస్యల పరిష్కారంలో విఫలం: మున్సిపల్ కార్మికుల సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం ఘోరంగా వైఫల్యం చెందిందని సిపిఐ(ఎంఎల్) లిబరేషన్ జిల్లా కార్యదర్శి ఎం.విశ్వనాథ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పట్టణంలోని పార్టీకార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కార్మికుల సమ్మెతో పట్టణంలో ప్రజలు తాగునీటి సమస్యను తీవ్రస్థాయిలో ఎదుర్కొంటున్నారన్నారు. కార్మికుల సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం తీరని అలసత్వం ప్రదర్శిస్తుండడంతోనే ఈ పరిస్థితి ఏర్పడిందన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి కార్మికుల సమస్యలను వెంటనే పరిష్కరించడం ద్వారా పట్టణ ప్రజల తాగునీటి అవసరాలను తీర్చాలంటూ ఆయన డిమాండ్ చేశారు. లేనిపక్షంలో తమపార్టీ ఆధ్వర్యంలో మున్సిపల్ కార్యాలయాన్ని ముట్టడిస్తామంటూ హెచ్చరించారు. కార్యక్రమంలో పార్టీనేతలు రమణ, ఆంజనేయులు పాల్గొన్నారు.

బి.కొత్తకోట: నగర పంచాయతీ కార్మికుల నిరవధిక సమ్మెలో భాగంగా భారతీయ అంబేద్కర్ సేన నాయకులు నగర పంచాయతీ కార్మికులకు మద్దతు తెలిపారు. కార్యక్రమంలో సచిన్, సింగన్న, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

ఫేస్ యాప్‌ను రద్దు చేయాలి

అంగన్వాడీ యూనియన్ జిల్లా అధ్యక్షులు శ్రీలక్ష్మి



రైల్వేకోడూరు : ఇన్‌ఛార్జి సిడిపిఒకు వినతిపత్రం అందజేస్తున్న అంగన్వాడీలు

ప్రజాశక్తి-రైల్వేకోడూరు

అంగన్వాడీ కేంద్రాలలో ఫేస్, ఇతర యాప్‌లను రద్దు చేయాలని అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (సిఐటియు అనుబంధం) జిల్లా అధ్యక్షులు ఎస్.శ్రీలక్ష్మి, వర్కింగ్ ప్రెసిడెంట్ టి.రాధాకుమారి అన్నారు. సోమవారం సిడిపిఒ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. అనంతరం ఇన్‌ఛార్జి సిడిపిఒ టి.సరళాదేవికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అంగన్వాడీ వర్కర్లకు, హెల్పర్లకు, మినీ వర్కర్లకు, గర్భిణులు, బాలింతలు, పిల్లలకు ఫేస్ యాప్ రద్దు చేసి సెంటర్ నిర్వహణకు ఒక యాప్ మాత్రమే నిర్వహించాలని పేర్కొన్నారు. పోషణ ట్రాకర్, బాల సంజీవని యాప్‌లలో లబ్ధిదారులకు ఆహారం ఒటిపి ద్వారా ఇకెవైసి ఫొటో క్యాప్చర్ చేస్తేనే సరుకులు ఇవ్వాలనే నిబంధనను తొలగించాలని డిమాండ్ చేశారు. నాణ్యమైన ఫుడ్ సరఫరా చేయాలని తెలిపారు. బియ్యం, పప్పు, నూనె నేరుగా సెంటర్లకు సరఫరా చేయాలన్నారు. సన్న బియ్యం అంగన్వాడీ పిల్లలకు ఇవ్వాలన్నారు. అంగన్వాడీ సెంటర్ల నిర్వహణకు 5జి ట్యాబ్‌లు ఇవ్వాలని చెప్పారు. అంగన్వాడీలకు సంక్షేమ పథకాలు అమలు చేయాలన్నారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు స్వర్ణలత, బి.వాణెమ్మ, శాంతమ్మ, మణెమ్మ, ఈశ్వరమ్మ పాల్గొన్నారు.

మదనపల్లె అర్బన్: అంగన్వాడీ కేంద్రాల్లో గర్భిణీలకు ప్రభుత్వం అందించే పౌష్టికాహార పంపిణీ కోసం ఏర్పాటు చేసిన ఎఫ్ఆర్ఎస్ పద్ధతి చాలా ఇబ్బందిగా ఉందని వెంటనే రద్దు చేయాలని అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్, లబ్ధిదారులు సిడిపిఒ కార్యాలయం వద్ద ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా లబ్ధిదారులు మాట్లాడుతూ తమను గర్భిణులుగా గుర్తించి నమోదు చేశారని, అయితే పాలు గుడ్లు, పౌష్టిహాకారం తీసుకోవడానికి ప్రతిసారి అంగన్వాడీ కేంద్రానికి వెళ్లాల్సి వస్తోందన్నారు. వెళ్లిన ప్రతిసారి ఫేస్ రికగ్నిషన్ సిస్టం (ఎఫ్ఆర్ఎస్) చేసినప్పుడు తమకు మిస్ మ్యాచింగ్ అని వస్తోందన్నారు. తమకు పౌష్టికాహారం ఇవ్వడం లేదన్నారు. ఇలా పలుమార్లు అంగన్వాడీ కేంద్రాల చుట్టూ తిరగాల్సి వస్తోందని, తద్వారా తమ ఇంటి పనులు చేసుకోలేక పోతున్నామని చెప్పారు. గంటల తరబడి అంగన్వాడీ కేంద్రాల వద్ద వేచి ఉండలేక పోతున్నామని వాపోయారు. ప్రభుత్వం ఎఫ్ఆర్ఎస్ పద్ధతిని రద్దుచేసి ఆధార్ కార్డు నమోదు చేసుకొని పాలు, గుడ్లు, పౌష్టికాహారం ఇవ్వాలని కోరారు. అనంతరం అంగన్వాడీ హెల్పర్స్ అండ్ వర్కర్స్ యూనియన్ నాయకులు మధురవాణి మాట్లాడుతూ ఎఫ్ఆర్ఎస్ పద్ధతి వల్ల సమయం చాలా వృథా అవుతోందన్నారు. ప్రభుత్వం ఇచ్చిన సెల్ ఫోన్లు సక్రమంగా పనిచేయకపోవడం, నెట్‌వర్క్ సమస్య కారణంగా లబ్ధిదారుల ఫొటోలు మిస్ మ్యాచింగ్ అని వస్తోందన్నారు. పలుమార్లు ఇలా రావడంతో వారికి పౌష్టికాహారం సరఫరా చేయడం చాలా ఇబ్బందిగా మారిందన్నారు. అంగన్వాడీ కేంద్రాల్లో స్టాకు నిల్వలు పేరుకొంటున్నాయని, అవి క్రమంగా పాడైపోయే పరిస్థితి నెలకొందన్నారు. అనంతరం ఇన్‌ఛార్జి సిడిపిఒ శ్వేతకు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో అంగన్వాడీ హెల్పర్స్ అండ్ వర్కర్స్ యూనియన్ నాయకులు గంగాదేవి, భాగ్యమ్మ, విజయ, సుజన, రాధిక, రాణి, లబ్ధిదారులు అమ్రిన్, షబ్ నమ్, శామల, అశ్విని, అనిత, హర్షియా పాల్గొన్నారు.



మదనపల్లె : సిడిపిఒ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న అంగన్వాడీలు



సెమినార్‌కు హాజరైన విద్యార్థులతో కళాశాల యాజమాన్యం

ముగిసిన యూనివర్సల్ హ్యూమన్ వాల్యూస్ సెమినార్

ప్రజాశక్తి-మదనపల్లె

ఎఐసిటిఇ, ఎన్‌సిసి ఆధ్వర్యంలో పట్టణంలోని మిట్స్‌లో నిర్వహిస్తున్న యూనివర్సల్ హ్యూమన్ వాల్యూస్‌పై ఐదు రోజుల ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్ విజయవంతంగా ముగిసిందని కళాశాల వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ రామనాథన్ తెలిపారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా డాక్టర్ యశ్వంత్ పాటిల్, శివాజీరావ్ ఎస్ జొండ్లే హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యూనివర్సల్ హ్యూమన్ వాల్యూస్ అనే విలువల బద్ధమైన విజ్ఞానం కోర్సును పద్ధతిగా స్వీయ అన్వేషణ ద్వారా అధ్యాపకులు, ద్యార్థులు కలిసి అన్వేషణ చేయడం వీలు పడుతుందని అన్నారు. మానవుని అంతిమ లక్ష్యం సంతోషంగా, ఐశ్వర్యవంతంగా ఉండడమన్నారు. కానీ మనం ఈ విషయాన్ని మర్చిపోయి వివిధ రకాల కార్యక్రమాలను శ్రమతోటి భౌతిక అవసరాల కోసం తాపత్రయ పడుతూ ఉంటామని చెప్పారు. జంతువులకు భౌతిక అవసరాలు మాత్రమే సరిపోతాయి కానీ మనుషులకు భౌతిక సదుపాయాలు తోపాటుగా గౌరవ మర్యాదలు కూడా కావాలని పేర్కొన్నారు. సరైన అవగాహన అనేది మనిషి అవసరాల్లో భౌతిక అవసరాలనేటివి పాక్షికం, తాత్కాలికమని చెప్పారు. కార్యక్రమంలో డాక్టర్ కే. శేషమహేశ్వరమ్మ, పులివెందుల జెఎన్‌టియు వైస్ ప్రిన్సిపల్, బి. రాఘవమ్మ, అసిస్టెంట్ ప్రొఫెసర్, వివిధ విభాగాల నుంచి 70 మంది పైగా అధ్యాపక బృందం, సమన్వయకర్తలు డాక్టర్ బి. జగదీశ్ బాబు, డాక్టర్ రంజిత్ భాస్కరన్ పాల్గొన్నారు.

కురువంక ఉప సర్పంచ్‌పై అవిశ్వాస తీర్మానం

ప్రజాశక్తి - మదనపల్లె అర్బన్

కురవంక పంచాయతీ ఉప సర్పంచ్ భారతీపై సోమవారం వార్డు సభ్యులు అవిశ్వాస తీర్మానాన్ని ప్రకటించారు. నాలుగేళ్ల కిందట జరిగిన సర్పంచ్ ఎన్నికల్లో 4వ వార్డు మెంబర్‌గా భారతీ ఎన్నికయ్యారు. అప్పట్లో సర్పంచ్‌గా పసుపులేటి చలపతి, ఉప సర్పంచ్‌గా భారతీని వార్డు మెంబర్లు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నాలుగేళ్లు పూర్తయినప్పటికీ ఉపసర్పంచ్ భారతి మిగిలిన వార్డు సభ్యుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించడం, పంచాయతీ అభివృద్ధికి తోడ్పాటు అందించకపోవడం, సమావేశాలకు గైర్హాజరవ్వడం తదితర అంశాలను పరిగణనలోకి తీసుకొని ఆమెపై అవిశ్వాస తీర్మానం పెట్టాలని నిర్ణయించారు. ఈ మేరకు సోమవారం సర్పంచ్ పసుపులేటి చలపతి ఆధ్వర్యంలో అత్యవసర సమావేశం నిర్వహించి అవిశ్వాస తీర్మానాన్ని ప్రవేశ పెట్టి, ఏకగ్రీవంగా ఆమోదించారు. అనంతరం ఉపసర్పంచ్ భారతి తొలగించి, తిరిగి ఉపసర్పంచ్ పదవికి ఎన్నిక నిర్వహించాలని సబ్ కలెక్టర్ కార్యాలయం ఎఒ కు వినతి పత్రం ఇచ్చారు. కార్యక్రమంలో వార్డు మెంబర్లు జి.కృష్ణమూర్తి, షాజహాన్, చంద్రకళ, గుల్జార్, అనిత, శ్రీనివాసులు, చందన, మున్ని బేగం, నాగరాజు కృష్ణ పాల్గొన్నారు.



సబ్ కలెక్టర్ కార్యాలయ ఎఒకు వినతిపత్రం ఇస్తున్న వార్డు మెంబర్లు

మృతుల కుటుంబాలకు పరిహారం చెల్లించాలి

- వ్య.కా.సం రాష్ట్ర ఉపాధ్యక్షులు శ్రీనివాసులు

ప్రజాశక్తి-రైల్వేకోడూరు

ఓబులవారిపల్లి మండలం, రెడ్డిపల్లి చెరువు కట్ట వద్ద ఈ నెల 13వ తేదీర మామిడికాయ లారీ ప్రమాదంలో మృతి చెందిన తొమ్మిది మంది వ్యవసాయ కూలీలకు ప్రభుత్వం కుటుంబానికి రూ.25 లక్షలు ఎక్స్‌గ్రేషియా ప్రకటించాలని వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు పి.శ్రీనివాసులు అన్నారు. మృతుల కుటుంబాలతో పాటు, తీవ్రంగా గాయపడిన వారికి రూ.10 లక్షలు ఎక్స్ గ్రేషియా చెల్లించాలని డిమాండ్ చేస్తూ సోమవారం తహశీల్దార్ కార్యాలయం వద్ద, సిఐటియు, వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. అనంతరం సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని తహశీల్దార్ అమర్నాథ్‌కు అందజేశారు. ఈ సందర్భంగా శ్రీనివాసులు మాట్లాడుతూ ప్రమోదం జరిగి, వారం రోజులు దాటినా శెట్టిగుంట వ్యవసాయ కూలీలు, వారి బంధువులు, శ్రీకాళహస్తి, వెంకటగిరికి చెందిన 9 మంది అక్కడికక్కడే మృతి చెందడం, మరో పది మంది తీవ్రంగా గాయపడ్డారన్నారు. ప్రభుత్వం ఎక్స్‌గ్రేషియో ప్రకటించకుండా గిరిజనుల పట్ల వివక్షత చూపుతోందని విమర్శించారు. శెట్టిగుంటలో రెండు కుటుంబాలు తల్లిదండ్రులను కోల్పోయిన పిల్లలు నలుగురు అనాధలుగా మిగిలారన్నారు. ఇప్పటివరకు బాధిత కుటుంబాలకు ప్రభుత్వం గానీ, దాతల ద్వారా గానీ ఒక్క రూపాయి కూడా సహాయం అందలేదన్నారు. ఇన్‌ఛార్జి మంత్రి బిసి జనార్దన్‌రెడ్డి రాజంపేట ఆస్పత్రిలో క్షతగాత్రులను పరామర్శించినప్పుడు సిఐటియు నాయకులు వారికి ఎక్స్‌గ్రేషియో ప్రకటించాలని డిమాండ్ చేయగా ముఖ్యమంత్రి చంద్రబాబు తో మాట్లాడి సహాయం ప్రకటిస్తామని చెప్పి వారమైనా ఒక్క రూపాయి ప్రకటించలేదన్నారు. కూటమి ప్రభుత్వం గిరిజనుల పట్ల ఎంత ప్రేమ ఉందో అర్థం అవుతోందన్నారు. చెరువు కట్టపైన రక్షణ గోడ లేకపోవడమే ప్రమాదానికి ప్రధాన కారణమన్నారు. రోడ్లు భవనాల శాఖ మంత్రి బాధ్యత వహించాలన్నారు. గిరిజనుల ఇంటి నిర్మాణాలు అసంపూర్తిగా ఉన్నాయన్నారు. ఇంటికి తలుపు కూడా లేని దౌర్భాగ్య పరిస్థితిలో జీవిస్తున్నారన్నారు. మూడు ఎకరాలు ప్రభుత్వం భూమి ఇచ్చి ఆదుకోవాలన్నారు. తిరుపతి రుయా ఆస్పత్రిలో బాధితులని ప్రయివేట్ ఆస్పత్రికి పొమ్మని ఒత్తిడి తెస్తున్నారన్నారని బాధితులు వాపోయారన్నారు. గిరిజనుడు పుత్తూరు నాటు వైద్యం చేయించుకున్నారని తెలిపారు. మెరుగైన వైద్యం అందడం లేదన్నారు. ప్రభుత్వం మృతుల పట్ల ఇప్పటికైనా స్పందించాలన్నారు. ఇన్‌ఛార్జి మంత్రి మాట నిలబెట్టుకొని వారి కుటుంబాలను ఆదుకొని న్యాయం చేయాలని లేకుంటే బాధితులతో కలిసి కలెక్టరేట్ ఎదుట ఆందోళన చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా అధ్యక్షులు సి హెచ్.చంద్రశేఖర్, రైల్వేకోడూరు, ఓబులవారిపల్లె మండల కార్యదర్శులు పి.జాన్ ప్రసాద్, పెంచలయ్య, వ్యవసాయ కార్మిక సంఘం మండల కన్వీనర్ బొజ్జ శివయ్య, గిరిజన సంఘం, నాయకులు వెంకటరమణ, వ్యవసాయ కౌలుదారు సంఘం జిల్లా నాయకులు, రమేష్ బాబు, జిల్లా నాయకులు, వెంకటాద్రి, సిఐటియు ఉపా ధ్యక్షులు, లింగాల యానాదయ్య, సహాయ కార్యదర్శి, నగిరిపాటి ఆనంద్, ముత్యాల శ్రీనివాసులు, బండారు రాజశేఖర్, శివ, రసూల్, హరి నారాయణ, ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు లతీఫ్, నాయకులు విష్ణు, శ్రీనివాసులు పాల్గొన్నారు.



తహశీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన తెలుపుతున్న నాయకులు

ప్రజా సమస్యలను బాధ్యతగా పరిష్కరించాలి : కలెక్టర్



అర్జీదారులతో సమస్యలు తెలుసుకుంటున్న కలెక్టర్ శ్రీధర్

ప్రజాశక్తి -రాయచోటి

ప్రజా సమస్యల పరిష్కార వేదిక ద్వారా వచ్చే సమస్యలను బాధ్యతగా పరిష్కరించాలని కలెక్టర్ శ్రీధర్ చామకూరి అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లోని పిజిఆర్ఎస్ హాలులో సోమవారం కలెక్టర్ అధ్యక్షతన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక ద్వారా అందిన ప్రజల సమస్యలను అత్యంత ప్రాధాన్యతతో బాధ్యతగా పరిష్కరించాలన్నారు. ముఖ్యమంత్రి కార్యాలయం కూడా ఫిర్యాదుల పరిష్కారం పై నేరుగా పర్యవేక్షిస్తుందని చెప్పారు. ప్రతి సమస్యను, ప్రజల నుంచి వచ్చే ఫీడ్ బ్యాక్ ను ప్రభుత్వం సీరియస్‌గా పరిశీలిస్తుందని, అధికారులందరూ ప్రాధాన్యతగా ఫిర్యాదులను నూరు శాతం పరిష్కరించాలన్నారు. ఇప్పటికే పెండింగ్‌లో ఉన్న బియాండ్ ఎస్ఎల్ఎ దరఖాస్తులపై వెంటనే చర్యలు తీసుకుని పరిష్కరించాలన్నారు. సమస్యను పట్టుకొని పరిష్కారం కోసం ఎంతో ప్రయాసతో ప్రజలు అధికారుల వద్దకు వస్తారని, వారి సమస్యను సావధానంగా వినాలన్నారు. సమస్య ఏమిటి, దానిని ఎలా పరిష్కరించాలన్న విషయాలపై అధికారులకు అవగాహన ఉండాలని, చిత్తశుద్ధితో ప్రజా సమస్యలను నాణ్యతగా పరిష్కరించాలని పేర్కొన్నారు. అనంతరం వివిధ సమస్యలతో వచ్చిన ప్రజల నుండి అర్జీలను స్వీకరించారు. ఎన్నో వ్యయ ప్రయాసలతో, సుదూర ప్రాంతాల నుంచి జిల్లా కేంద్రం రాయచోటికి వచ్చిన అర్జీదారులకు జిల్లా కలెక్టర్ స్నాక్స్, వాటర్ బాటిల్, టీ సౌకర్యాలను కల్పించారు కార్యక్రమంలో సంయుక్త కలెక్టర్ ఆదర్శ రాజేంద్రన్, డిఆర్ఒ మధుసూదనరావు, రాయచోటి ఆర్‌డిఒ శ్రీనివాస్, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

పథకాలు ప్రజలకు చేర్చాల్సిన బాధ్యత నాయకులదే

- మైనార్టీ శాఖ మంత్రి ఎన్.ఎం.డి.ఫరూక్

ప్రజాశక్తి - మదనపల్లె అర్బన్

ప్రభుత్వం ప్రజల సంక్షేమం కోసం ప్రవేశపెడుతున్న పథకాలను వారి దరికి చేర్చాల్సిన బాధ్యత ప్రతి నాయకుడు పై ఉందని మైనార్టీ శాఖ మంత్రి ఎన్.ఎం.డి.ఫరూఖ్ అన్నారు. మదనపల్లెకు విచ్చేసిన మంత్రి ఎమ్మెల్యే షాజహాన్ బాషా తో కలిసి సోమవారం కోళ్లబైలు-1 లో నిర్వహించిన సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా గ్రామంలోని ప్రజలతో మమేకమై వారి సమస్యలను, ఇబ్బందులను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం అందజేస్తున్న సంక్షేమ పథకాలు అందుతున్నాయా.. లేదా అని ఆరా తీశారు. ఇంటింటికి వెళ్లి తెలుగుదేశం ప్రభుత్వం ఏడాది పాలనలో చేసిన అభివృద్ధి, ప్రజలకు అందించిన సంక్షేమ పథకాలను ముద్రించిన కరపత్రాలను ప్రజలకు పంచిపెట్టి వారి అభిప్రాయాలను తెలుసుకున్నారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో మంత్రి మాట్లాడుతూ అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందజేస్తామని, సంక్షేమ పథకాలు అందని వారు సంబంధిత సచివాలయాల్లో తమ అర్జీలను ఇవ్వాలన్నారు. అక్కడ సమస్య పరిష్కారం కాకపోతే ఎమ్మెల్యేను సంప్రదించాలన్నారు. నాయకులు అధికారులతో మాట్లాడుతూ ప్రజలతో సత్సంబంధాలు కొనసాగిస్తూ వారికి అవసరమైన ప్రతి సమస్యను పరిష్కరించాలని చెప్పారు. కూటమి ప్రభుత్వంలో చంద్రబాబునాయుడు పాలనలో సంక్షేమ, అభివృద్ధి రెండు కళ్లుగా పరుగులు పెడుతోందన్నారు. ప్రతి కుటుంబాన్ని పేదరికం నుంచి బయటపడేసేందుకు ప్రభుత్వం పని చేస్తోందన్నారు. ప్రభుత్వం ప్రజలకు అందిస్తున్న పథకాలను ప్రజలకు వివరంగా చెప్పాలని నాయకులు, కార్యకర్తలకు సూచించారు. ఉద్యోగస్తులు ప్రజల సమస్యలపై ఎప్పటికప్పుడు స్పందిస్తూ పరిష్కార దిశగా పయనించాలన్నారు. కార్యక్రమంలో కూటమి పార్టీ నాయకులు, ప్రజలు పాల్గొన్నారు.



ప్రజలకు కరపత్రాలను పంచుతున్న మంత్రి, ఎమ్మెల్యే

బాధితులకు సత్వర న్యాయం అందించాలి : ఎస్‌పి

ప్రజాశక్తి - రాయచోటి టౌన్

ప్రజా సమస్యల పరిష్కార వేదికకు వచ్చే సమస్యలను సత్వర న్యాయం అందించాలని ఎస్‌పి విద్యాసాగర్ నాయుడు అన్నారు. సోమవారం పోలీసు ప్రధాన కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక ద్వారా వినతులను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వృద్ధులు , విభిన్న ప్రతిభావంతులు, మహిళలకు సంబంధించిన ఫిర్యాదులపై వెంటనే స్పందించి పరిష్కరించాలని అధికారులకు ఆదేశించారు. కేంద్రానికి రాలేని వారు జిల్లా పోలీస్ స్టేషన్‌లో, సర్కిల్ సబ్ డివిజన్ కార్యాలయాల్లో అర్జీలను సమర్పించవచ్చని తెలిపారు. పెద్దమండెం మండలం కలిచర్ల గ్రామానికి చెందిన విభిన్న ప్రతిభావంతుడు గంగాధర్ నడవలేని పరిస్థితుల్లో తన సమస్యను చెప్పుకునేందుకు కార్యాలయానికి రావడంతో విషయం తెలుసుకున్న ఎస్‌పి స్వయంగా అతని వద్దకు వెళ్లి ఫిర్యాదును పరిశీలించి చట్ట పరిధిలో సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. అనంతరం అధికారులకు బాధితులకు వెంటనే సమస్యను పరిష్కరించాలని ఆదేశించారు.

విద్యార్థుల భాగస్వామ్యం కీలకం

ప్రజాశక్తి-పీలేరు

ప్లాస్టిక్ వినియోగానికి స్వస్తి పలకడంలో విద్యార్థుల భాగస్వామ్యం కీలకమని తలుపుల పిహెచ్‌సి ప్రధాన వైద్యాధికారిణి డాక్టర్ శ్రీగిరీష తెలిపారు. సోమవారం పీలేరు మండలం మేళ్లచెరువు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు "ప్లాస్టిక్ వినియోగం - ప్రజారోగ్య అనర్థాలు" అనే అంశంపై అవగాహన కల్పించారు. ఈ సందర్ఠంగా వైద్యాధికారిణి మాట్లాడుతూ ప్లాస్టిక్ వినియోగంతో నీరు, గాలి, భూమి కలుషితం అవడమేకాకుండా పర్యావరణం, మనిషి ఆరోగ్యానికి కూడా హాని కలుగుతుందని అన్నారు. పేపరు, గుడ్డ, లేదా ఇతర పర్యావరణ అనుకూల పదార్థాలతో చేసిన సంచులను మాత్రమే ఉపయోగించాలని, ఇది అందరి బాధ్యతని కూడా డిప్యూటీ హెచ్ఇఒ కొండయ్య సూచించారు. కార్యక్రమంలో డిప్యూటీ హెచ్ఇఒ కొండయ్య, హెడ్మాస్టర్ సురేంద్ర, పర్యవేక్షకులు కృష్ణయ్య, సి హెచ్ఒలు కుముద, లావణ్య, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

విద్యుత్ శాఖలో ఖాళీలను భర్తీ చేయాలి

ప్రజాశక్తి - మదనపల్లె అర్బన్

విద్యుత్ శాఖలో ఖాళీగా పోస్టులను భర్తీ చేయాలని ఎపిఎస్ఇఇ యూనియన్-327 డివిజన్ రాష్ట్ర సెక్రటరీ జనరల్ ఎం.విరాఘవరెడ్డి డిమాండ్ చేశారు. సోమవారం మదనపల్లె పట్టణం, రామారావు కాలనీలోని శ్రీరస్తు కళ్యాణ మండపంలో విద్యుత్ శాఖ ఎపిఎస్ఇఇ యూనియన్ -327 డివిజన్ స్థాయి సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన రాఘవరెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న జూనియర్ లైన్‌మెన్ గ్రేడ్- 2 వారికి రెగ్యులర్ సిబ్బందికి ఉన్న సర్వీస్ నిబంధనలను వర్తించేలాచర్యలు తీసుకోవాలని యాజమాన్యం దృష్టికి తీసుకెళ్లామన్నారు. 2004 తర్వాత పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని డిమాండ్ చేశామన్నారు. గ్రామీణ ప్రాంతాలలో జూనియర్ లైన్‌మెన్ ఖాళీలను భర్తీ చేయాలని తెలిపారు. మదనపల్లె డివిజన్ కార్మికుల సమస్యల పైన విద్యుత్ యాజమాన్యం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తామని పేర్కొన్నారు. సమావేశంలో మదనపల్లె డివిజన్ నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా వి. ఆనందరెడ్డి, కార్యదర్శిగా పి.మురళిరామకృష్ణ, గౌరవాధ్యక్షులుగా గోపాల్ రెడ్డిని ఎన్నుకున్నారు. సమావేశంలో డిస్కమ్ సెక్రెటరీ పి. షణ్ముగం, తిరుపతి రీజనల్ సెక్రటరీ ఆర్. మురళీధర్, మదనపల్లె 327 డివిజన్ సభ్యులు పాల్గొన్నారు.

స్వచ్ఛ గ్రామంగా తీర్చిదిద్దుకుందాం

ప్రజాశక్తి-రామాపురం

మన ఇంటిని, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకొని మన గ్రామాన్ని స్వచ్ఛ గ్రామంగా ఆదర్శంగా తీర్చిద్దుతామని కేంద్ర శానిటేషన్ టీం సభ్యుడు హేమంత్, ఆర్‌డబ్ల్యుఎస్ డిఇఇ పి.విద్య పేర్కొన్నారు. మండలంలోని హసనాపురం గ్రామంలో సోమవారం స్వచ్ఛభారత్‌లో భాగంగా నిర్వహిస్తున్న కార్యక్రమాన్ని సెంట్రల్ శానిటేషన్ టీం సభ్యుడు పర్యవేక్షించారు. సందర్భంగా గ్రామంలోని పాఠశాలలను అంగన్వాడీ కేంద్రాలను హెల్త్ సెంటర్ ఎస్‌డబ్ల్యు పిసి షెడ్లను వ్యక్తిగత మరుగుదొడ్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామ ప్రజలలో పారిశుధ్యంపై అవగాహన ముఖ్యమని చెప్పారు. వ్యక్తిగత శుభ్రతపై ప్రతి ఒక్కరు అవగాహన పెంచుకోవాలన్నారు. ఎస్‌డబ్ల్యు పిసిని గ్రామపంచాయతీకి ఆదాయ వనరుగా ఉపయోగించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచి ఆంజనేయులు, డిఆర్‌పి అప్రాస్‌వలి, కార్యదర్శి ఓబులమ్మ, ఎంఆర్‌సి కదిరప్ప నాయుడు, స్వచ్ఛభారత్ మిషన్ గ్రామీణ్ కాన్సలెంట్ మద్దిలేటి, సచివాలయ సిబ్బంది, ఉపాధ్యాయులు, అంగన్వాడీ కార్యకర్త, ఆరోగ్యకార్యకర్తలు గ్రామస్తులు పాల్గొన్నారు.



బస్టాండ్‌లో చెత్త సేకరణను తనిఖీ చేస్తున్న ఎంపిడిఒ రమేష్‌బాబు

బస్టాండ్‌లో పరిశుభ్రతను పాటించండి

ప్రజాశక్తి-నిమ్మనపల్లె

నిమ్మనపల్లి బస్టాండులో పరిశుభ్రతను పాటించాలని ఎంపిడిఒ రమేష్ బాబు అన్నారు. సోమవారం డిప్యూటీ ఎంఎంపిడిఒ బాలరాజుతో కలిసి ఇంటింటా చెత్త సేకరణ కార్యక్రమాన్ని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండల కేంద్రమైన నిమ్మనపల్లి బస్టాండులో, బస్టాండ్ కూడలిలో పరిశుభ్రతను పాటించాలని సూచించారు. దుకాణదారులు చెత్తను బయట పడవేయొద్దన్నారు. టి అంగళ్ల వద్ద, పానీపూరి బండ్ల వద్ద వాడిన కప్పులను, పూల బండ్ల వద్ద పూలను ఒకచోట ఉంచకుండా రోడ్డుపైన, ఎక్కడపడితే అక్కడ పడేస్తున్నారని, చెత్తను ఒకే చోట ఉంచుకొని చెత్త బండి వచ్చినప్పుడు బండిలో వేయాలని పేర్కొన్నారు. బస్టాండులో ప్రయాణికులు, విద్యార్థులు నిత్యం ప్రయాణిస్తుంటారని చెత్తను విచ్చలవిడిగా పడేయడం వలన అపరిశుభ్రంగా ఉండడంతో పాటు ప్రయాణికులకు అసౌకర్యంగా ఉంటుందన్నారు. చిరు దుకాణదారులు తమ దుకాణంలోని చెత్తను, వాడిన ప్లాస్టిక్ బాటిల్లను విచ్చలవిడిగా పడవేయొద్దన్నారు. పారిశుధ్య కార్మికులు బస్టాండులో నిత్యం శుభ్రపరుస్తున్నా దుకాణదారులు మాత్రం బాధ్యతగా వ్యవహరించడం లేదన్నారు. పారిశుధ్యం విషయంలో దుకాణదారులు బాధ్యతారాహితంగా ప్రవర్తిస్తే జరిమానాలు విధిస్తామన్నారు. బస్టాండ్‌లోని పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడానికి అందరూ సహకరించాలని కోరారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి వెంకటరమణారెడ్డి పాల్గొన్నారు.

25న ఉచిత కంటి వైద్య శిబిరం

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

జర్నలిస్టుల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకొని ఈనెల 25న రాజంపేట ప్రెస్ క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న జర్నలిస్టుల ఉచిత కంటి వైద్య శిబిరాన్ని ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులు సద్వినియోగం చేసుకోవాలని ప్రెస్ క్లబ్ తాలూకా అధ్యక్షులు వెంకటరెడ్డి, రాజంపేట ప్రెస్ అధ్యక్షులు భాస్కర్ తెలిపారు. సోమవారం ఆర్ అండ్ బి అతిథి గృహంలో వారు మాట్లాడుతూ పాత్రికేయులకు కంటి వైద్య పరీక్షలు నిర్వహించిన అనంతరం కంటి చూపు తక్కువ ఉన్నవారికి కంటి అద్దాలను అందజేస్తామన్నారు. సమావేశంలో ప్రెస్ క్లబ్ ప్రధాన కార్యదర్శి మందా శివయ్య, కోశాధికారి సునీల్, కార్యనిర్వాహక కార్యదర్శి శ్రీహరి, ఉదయగిరి కళ్యాణ్, నాగేంద్ర ప్రసాద్, నరసింహ, రవి పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలకు టిడిపి నాంది

ప్రజాశక్తి-రామాపురం

భారత దేశంలో సంక్షేమ పథకాలకు అంకురార్పణ చేసింది తెలుగుదేశం పార్టీ అని ఆ పార్టీ మండల నాయకుడు రాంబసిరెడ్డి పేర్కొన్నారు. మండలంలోని బండపల్లి పంచాయతీ వెంకటరెడ్డిగారిపల్లె 54వ బూత్ పరిధిలో సోమవారం సుపరిపాలన తొలి అడుగు డోర్ టు డోర్ టిడిపి కార్యక్రమంలో భాగంగా ఇంటింటికి వెళ్లే చంద్రబాబు 4.1 ఏడాది పాలన గురించి వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇచ్చిన హామీలలో 80 శాతం అందించి సంక్షేమం అభివృద్ధి తమ ధ్యేయంగా టిడిపి పాలన సాగిస్తోందన్నారు. పార్టీలకు అతీతంగా వృద్ధులకు, వితంతువులకు, వివిధ ప్రతిభావంతులు, ఎన్టీఆర్ పెన్షన్, తల్లికి వందనం, అన్న క్యాంటీన్ ఏడాదికి మూడు సిలిండర్లు ఉచిత జూలై చివరి నాటికి అన్నదాత సుఖీభవ, ఆగస్టు 15న మహిళలకు బస్సులో ఉచిత ప్రయాణం పథకాలు అమలుపై ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో యూనిట్ ఇన్‌ఛార్జి రెడ్డిబాబు, గ్రామ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపిడిఒ రమేష్‌బాబు

పి4 అమలుకు ప్రత్యేక కార్యాచరణ

ప్రజాశక్తి-నిమ్మనపల్లె

పి4 అమలుకు ప్రత్యేక కార్యాచరణను రూపొందిస్తున్నట్లు ఎంపిడిఒ రమేష్ బాబు తెలిపారు. సోమవారం స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో డిప్యూటీ ఎంపిడిఒ బాలరాజుతో కలిసి పంచాయతీ కార్యదర్శులు, సంక్షేమ, విద్యా సహాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పి4 అమలు చేయటానికి ప్రత్యేకంగా తీసుకోవాలన్నారు. పి4లో వెనుకబడిన అట్టడుగున ఉన్న 20 శాతం కుటుంబాలను గుర్తించి వారిని ధనికులు దత్తత తీసుకొని వారికి ఆర్థిక అసమానతలను రూపుమాపడమే ప్రభుత్వ ఉద్దేశమన్నారు. మండలంలో జరుగుతున్న పి4 సర్వే ద్వారా ఇప్పటికే 506 బంగారు కుటుంబాల గుర్తించినట్లు తెలిపారు. వెనుకబడిన కుటుంబాలను ఆర్థికంగా ఆదుకోవటానికి ఇప్పటికే అనేకమంది డాక్టర్లు, ఇంజినీర్లు, ఎన్ఆర్ఐలు, వ్యాపారస్తులు ముందుకు వచ్చారన్నారు. ఇప్పటికే పి4 సర్వే పూర్తికాగా అందులోనే అర్హులను గుర్తించేందుకు అధికారులు కృషి చేస్తున్నట్లు తెలిపారు. ప్రతినెలాగే సామాజిక పెన్షన్లను ఒకటవ తేదీనే పంపిణీ చేయడానికి అధికారులు అందుకు తగ్గ సన్నాహాలను పూర్తి చేయాలని సూచించారు. ఒకటవ తారీఖున 100 శాతం పింఛన్లు పంపిణీ చేయడానికి కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు, వెల్ఫేర్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

గృహాలు సకాలంలో పూర్తి చేయాలి

ప్రజాశక్తి-గాలివీడు

గృహాలు సకాలంలో పూర్తి చేయాలని ఎంపిడిఒ కె.చంద్ర మౌళీశ్వరావు పేర్కొన్నారు. సోమవారం ఎంపిడిఒ సభ భవనంలో హౌసింగ్ ఎఇ బి. రమేష్ నాయక్ అధ్యక్షతన ఇంజినీరింగ్ అసిస్టెంట్లతో సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎంపిడిఒ మాట్లాడుతూ 17 గ్రామాలలో హౌసింగ్ పైన వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఆర్‌ఎల్ కింద 137 గృహాలు ఉన్నాయని ఆర్ఓ కింద 47 ఉన్నాయని రెండు స్టేజీలలో ఉన్న గృహాలు సకాలంలో పూర్తి కావడానికి చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. ప్రభుత్వ మిస్తున్న రూ.1.80 లక్షలు కంటే ఎస్సీ, బీసీలకు రూ.50 వేల అదనంగా అందిస్తున్నదని పేర్కొన్నారు. ఎస్టీలకు రూ.75 వేలు ఇస్తున్నారని తెలిపారు. బిల్లు పెట్టిన నాలుగైదు రోజుల్లో లబ్ధిదారుల ఖాతాలో జమ అవుతుందని పేర్కొన్నారు. ఇంకా ఎవరైనా నిర్మాణం పై జాప్యం చేస్తుంటే అటువంటి వారు త్వరగా పూర్తి చేసుకోవాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఇంజనీరింగ్ అసిస్టెంట్లు, హౌసింగ్ డేటా ఎంట్రీ షాకీర్ సిబ్బంది పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంపిడిఒ కె.చంద్ర మౌళీశ్వరావు

రైతుల సంక్షేమమే ధ్యేయం : కలెక్టర్



పోస్టర్లు ఆవిష్కరిస్తున్న కలెక్టర్ శ్రీధర్, జెసి ఆదర్శరాజేంద్రన్

ప్రజాశక్తి-రాయచోటి

రైతుల సంక్షేమం కోసం కేంద్ర ప్రభుత్వం ధ్యేయమని, పిఎం ప్రణాం స్కీమ్ ప్రవేశపెట్టిందని కలెక్టర్ శ్రీధర్ అన్నారు. సోమవారం కలెక్టరేట్‌లోని పిజిఆర్ఎస్ హాలులో పచ్చిరొట్ట జీవన ఎరువుల పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రవేశపెట్టిన పీఎం ప్రణామ్ స్కీమ్ ద్వారా బయో ఎరువులు, సేంద్రీయ ఎరువులతో కలిపి ఎరువుల సమతుల్య వినియోగాన్ని ప్రోత్సహించడమే ప్రధాన లక్ష్యమన్నారు. పథకం ద్వారా కృత్రిమ, రసాయన ఎరువులను వినియోగాన్ని తగ్గించి సేంద్రియ, జీవన ఎరువులు వాడకాన్ని పెంచడమే ప్రధాన ఉద్దేశ్యమన్నారు. తద్వారా ఆరోగ్యమైన నేలతో పాటు సారం, పోషకాల లభ్యత పెరిగి నాణ్యమైన పంట దిగబడి వస్తుందని తెలిపారు. ఎరువులకయ్యే ఖర్చు 25 శాతం కూడా తగ్గించుకోవచ్చన్నారు. వర్షానికి ముందే పచ్చి రొట్ట పొడి విత్తనాలు చల్లుకోవడం వల్ల వర్షం పడిన తర్వాత పంట మొలకెత్తడంతో పాటు నేల సారం పెంచడానికి ఉపయోగపడుతుందన్నారు. నత్రజని సంబంధిత జీవన ఎరువు రైజోబియం, అజటోబ్యాక్టర్ అజోస్పైరిల్లం మరియు భాస్వరం సంబంధిత జీవన ఎరువు ఫాస్ఫరస్ సాల్యూబులైజింగ్ బ్యాక్టీరియా, పొటాషియం రిలీజింగ్ బ్యాక్టీరియా వాడటం వలన మొక్కకి పోషకాల లభ్యత పెరుగుతుందని సూచించారు. కార్యక్రమంలో జెసి ఆదర్శరాజేంద్రన్, జెడిఎ శివనారాయణ పాల్గొన్నారు.

విద్యార్థుల ఆటోను ఢీకొన్న పాఠశాల బస్సు

- ఆరుగురు విద్యార్థులకు గాయాలు



ప్రమాదంలో గాయపడి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న విద్యార్థులు

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

కురబలకోట మండలం, ముదివేడు క్రాస్‌లో సోమవారం సాయంత్రం విశ్వం స్కూలు బస్సు, మోడల్ స్కూల్ పిల్లలను తరలిస్తున్న ఆటోను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ముదివేడు మోడల్ స్కూల్ విద్యార్థులు పలువురు తీవ్రంగా గాయపడ్డారు. సిఐ సత్యనారాయణ కథనం మేరకు.. విశ్వం స్కూల్ బస్సు ముదివేడు క్రాస్ వద్దకు రాగానే, పాఠశాల ముగించుకుని ఆటోలో ఇంటికి వెళుతున్న మోడల్ స్కూల్ విద్యార్థుల ఆటోను బస్సు ఢీకొట్టింది. ప్రమాదంలో విద్యార్థులు శివమణి, పల్లవి, లహరి, కేశవ, యశ్వంత్, మంజుల, తదితరులు గాయపడ్డారు. కురబలకోట 108 సిబ్బంది మస్తాన్, బావాజాన్ హుటాహుటిన సంఘటనా స్థలానికి వెళ్ళి బాధిత విద్యార్థును మదనపల్లె జిల్లా ఆసుపత్రికి తరలించారు. సమాచారం అందుకున్న తంబళ్లపల్లె టిడిపి పరిశీలకులు మల్లికార్జున నాయుడు, వై.జి.సూరి, రూరల్ సిఐ సత్యనారాయణ ఆసుపత్రి వద్దకు చేరుకుని అత్యవసర విభాగంలో చికిత్స పొందుతున్న పిల్లలని పరామర్శించారు. మెరుగైన వైద్యం అందించాలని డాక్టర్లను ఆదేశించారు. సకాలంలో వైద్యులు మెరుగైన చికిత్స అందించడంతో ప్రాణాపాయం తప్పి విద్యార్థులు కోలుకుంటున్నారు.

మదనపల్లెలోనే వాహనాలకు ఎఫ్‌సి ఇవ్వాలి

- మంత్రి ఫరూక్‌కు లారీ అసోసియేషన్ సభ్యుల వినతి



మంత్రి, ఎమ్మెల్యేను కలిసిన లారీ అసోసియేషన్ సభ్యులు

ప్రజాశక్తి - మదనపల్లె అర్బన్

మదనపల్లె ఎంవిఐ కార్యాలయంలోనే వాహనాలకు ఎఫ్‌సి ఇవ్వాలని లారీ అసోసియేషన్ సభ్యులు సోమవారం మదనపల్లెకు వచ్చిన మైనార్టీ శాఖా మంత్రి ఎన్.ఎండి. ఫరూఖ్, ఎమ్మెల్యే షాజహాన్ బాషకు వినతి పత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా లారీ డ్రైవర్స్ అసోసియేషన్ సభ్యులు మాట్లాడుతూ ఆటోల దగ్గర నుండి లారీల వరకు ఫిట్నెస్ సర్టిఫికేట్‌ను గతంలో ఎంవిఐ కార్యాలయంలోనే ఇచ్చేవారన్నారు. ప్రస్తుతం ఈ ఫిట్నెస్ సర్టిఫికేట్ పొందాలంటే అన్నమయ్య జిల్లా, రాయచోటి హెడ్ క్వార్టర్‌లో ఉన్న ఆర్‌టిఒ కార్యాలయానికి వెళ్లాలని నిబంధన పెట్టారన్నారు. దీని వల్ల వల్ల ప్రతి వాహనదారుడూ వాహనంతో సహా రాయచోటికి వెళ్లాల్సిన పరిస్థితి నెలకొందని పేర్కొన్నారు. ఎఫ్‌సి ఖర్చు రూ.2 వేలతో పాటు డీజిల్, భోజనాలు ఖర్చు మరో రూ. 5 వేలు వరకూ రావడంతో భారంగా ఉందన్నారు. సమస్యను పరిష్కరించే దిశగా చర్యలు తీసుకోవాలని ఒకరారు. స్పందించిన మంత్రి, ఎమ్మెల్యే మాట్లాడుతూ ట్రాన్స్ పోర్ట్ కమిషనర్‌తో మాట్లాడి సమస్యను వారికి తెలియజేసి, పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు.

మద్యం స్కాంలో అసలు సూత్రధారి జగన్ : ఆర్‌జె



మాట్లాడుతున్న ఆర్.జె.వెంకటేష్

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

మద్యం స్కాంలో అసలు సూత్రధారి మాజీ సిఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డే అని, కసిరెడ్డి, మిథున్‌రెడ్డి, అవినాష్‌రెడ్డి, విజయసాయిరెడ్డి పాత్రదారులని రాజంపేట పార్లమెంట్ టిడిపి అధికార ప్రతినిధి ఆర్.జె. వెంకటేష్ అన్నారు. సోమవారం స్థానిక పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ దేశంలో బోఫోర్స్ స్కాం కంటే మద్యం స్కాం చాలా పెద్దదని, ఈ స్కామ్‌లో పూర్తి స్థాయి ఆధారాలతో విచారణ అధికారులు ఎంపీ మిథున్‌రెడ్డిని అరెస్టు చేయడం సమర్ధనీయమన్నారు. ఒక్క ఛాన్స్ పేరుతో అధికారంలోకి వచ్చిన వైసిపి ప్రభుత్వం రూ.3,500 కోట్లు మద్యం పాలసీలో అక్రమాలకు పాల్పడిందని ఆరోపించారు. ఇంత భారీ స్కాం దేశంలో మరెక్కడా జరగలేదని గుర్తు చేశారు. మద్యం స్కాంలో సాక్షాలను కోర్టుకు సమర్పించి, అందులో ప్రమేయం ఉన్న ఎంపీ మిథున్‌రెడ్డిని అరెస్టు చేస్తే, వైసిపి నాయకులు గగ్గోలు పెట్టడం ఏంటని ప్రశ్నించారు. కోర్టుకు సమర్పించిన సాక్ష్యాలు కూడా సాంకేతిక పరిజ్ఞానంతో, గూగుల్ టెకోవర్ ద్వారా సేకరిం చారని గుర్తు చేశారు. సమావేశంలో తెలుగు రైతు రాష్ట్ర కార్యని ర్వహణ కార్యదర్శి రాటకొండ మధుబాబు, మల్లికార్జున, గండికోట గణేష్, శివకృష్ణ, గోపాల్, విద్యా సాగర్, రామాంజులు, భాస్కర్ పాల్గొన్నారు.

వ్యక్తి గత దూషణలు సరికాదు

రాయచోటి: మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి ఆధ్వర్యంలో ఏడాదిలో నియోజ కవర్గంలో తాగునీరు, డ్రెయినేజీ, ఇతర మౌలిక వసతులు కల్పించారని అలాంటి వ్యక్తిపై వ్యక్తిగత దూషణలు చేయడం సరికాదని రాయచోటి మార్కెట్ కమిటీ చైర్మన్ బోడిరెడ్డి రాంప్రసాద్‌రెడ్డి పేర్కొన్నారు. సోమవారం పట్టణంలోని కొత్తపేట టిడిపి కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ మాజీ ఎమ్మెల్యే రమేష్‌రెడ్డి మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డిపై వ్యక్తిగతంగా మాట్లాడితే సహించబోమన్నారు. అభివృద్ధి, సంక్షేమంపై ప్రశ్నించాల్సింది పోయి నేతలను టార్గెట్ చేసి మాట్లాడడం సబబు కాదన్నారు. సమావేశంలో జిలాని బాషా పాల్గొన్నారు.

మాజీ ఎమ్మెల్యే రమేష్‌రెడ్డి అరెస్టు అక్రమం

ప్రజాశక్తి - మదనపల్లె అర్బన్

రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అణచివేత పాలన సాగిస్తోందని, ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు వైసిపి నాయకులపై అక్రమ కేసులు బనాయించి వేధింపులకు గురి చేస్తున్నారని అందులో భాగంగానే మాజీ ఎమ్మెల్యే రమేష్ రెడ్డిని అరెస్టు చేశారని, దీనిని తీవ్రంగా ఖండిస్తున్నామని మదనపల్లె వైసిపి సమన్వయకర్త నిస్సార్ అహమ్మద్ అన్నారు. సోమవారం మదనపల్లె వైసిపి సమన్వయకర్త నిస్సార్ అహమ్మద్ తాలూకా స్టేషను వద్దకు చేరుకుని రమేష్ రెడ్డిని పరామర్శించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రతిపక్షం లేకుండా అణగదొక్కాలని ప్రభుత్వం అరెస్టులు చేస్తోందని విమర్శలు గుప్పించారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా మాట్లాడినా, పాలనను వ్యతిరేకించినా ఎమర్జెన్సీని తలపించేలా అరెస్టులు చేసి, గొంతు నొక్కుతున్నారన్నారు. ఏపిలో అంబేద్కర్ రాజ్యాంగం కాకుండా రెడ్ బుక్ రాజ్యాంగం నడుస్తోందని మండిపడ్డారు. లిక్కర్ పాలసీలో ఎంపీ మిథున్ రెడ్డి ఎలాంటి సంబంధం లేకపోయినా కేసులు బనాయించి అరెస్టు చేశారన్నారు. రమేష్ రెడ్డిని పరామర్శించిన వారిలో నిస్సార్ అహమ్మద్‌తోపాటు పెద్ద సంఖ్యలో వైసిపి నాయకులు పాల్గొన్నారు.

ఎపిఎంఎస్ఐడిసి చైర్మన్‌ను కలిసిన 'కామిశెట్టి'



శ్రీనివాసులును సన్మానిస్తున్న కామిశెట్టి

ప్రజాశక్తి-పీలేరు: ఎపిఎంఎస్ఐడిసి చైర్మన్ చిల్లపల్లి శ్రీనివాసులును పీలేరు నియోజ కవర్గం జనసేన సీనియర్ నాయకుడు కామిశెట్టి సుధాకర్ మర్యాదపూర్వకంగా కలిశారు. సోమవారం జనసేన నాయకుడు చైర్మన్‌ను మంగళగిరిలోని తన క్యాంప్ కార్యాలయంలో కలిసి శాలువా కప్పి పుష్పగుచ్ఛాన్ని అందించి అభిమానాన్ని చాటుకున్నారు. ఈ సందర్భంగా చైర్మన్ నియోజకవర్గంలో జనసేన పార్టీ, నాయకులు, కార్యకర్తల స్థితిగతులను అభిమానంగా అడిగి తెలుసుకున్నారని సుధాకర్ చెప్పారు. పార్టీ కార్యకర్తల విన్నపాలపై ప్రభుత్వ కార్యాలయాల్లో అధికారుల స్పందన పట్ల కూడా ఆరా తీసినట్లు తెలిసింది. పార్టీ అభివృద్ధితో పాటు కూటమి బలోపేతానికి అందరూ సమిష్టిగా అంకిత భావంతో పని చేయాలని సూచించినట్లు సమాచారం. జనసేన నాయకుడి వెంట పలువురు పార్టీ కార్యకర్తలు కూడా పాల్గొన్నారు.

బస్సు సౌకర్యం కల్పించాలి

ప్రజాశక్తి-వీరబల్లి

రాయచోటి నుంచి వీరబల్లి మండలానికి బస్సు సౌకర్యం కల్పించాలని ఎంపిడిఒ జవహర్‌బాబు ఎపిఎస్ ఆర్‌టిసి రాయచోటి డిపో మేనేజర్‌కు రిక్వెస్ట్ లెటర్ పంపించామని ఒక ప్రకటనలో తెలిపారు. రాయచోటి నుంచి వీరబల్లికి, వీరబల్లి నుంచి రాయచోటికి ప్రభుత్వ ఉద్యోగులు, విద్యార్థులు, ప్రయాణికులు ప్రయాణం చేయాల్సి వస్తే బస్సు సౌకర్యం లేదన్నారు. గతంలో బస్సులు నడుస్తూ ఉండేవి. బస్సు సౌకర్యం లేక ప్రభుత్వ ఉద్యోగులు టైం ప్రకారం ప్రభుత్వ కార్యాలయాలకు చేరుకోవాలంటే చాలా ఇబ్బంది పడుతున్నారు. డిపో మేనేజర్ వీరబల్లికు బస్సు సౌకర్యం కల్పించాలని ప్రజలు, ప్రభుత్వ ఉద్యోగస్తులు కోరుతున్నారు.

హోరాహోరీగా క్రికెట్ టోర్నీ

ప్రజాశక్తి - కడప

ఎసిఎ సౌత్ జోన్ అండర్-16 మల్టీ డే క్రికెట్ టోర్నమెంట్‌లో భాగంగా వై.ఎస్.రాజారెడ్డి ఎసిఎ స్టేడియంలో ప్రారంభమైన చిత్తూరు, అనంతపురం మ్యాచ్ హోరాహోరీగా సాగుతోంది. టాస్ గెలిచి బ్యాటింగ్ ప్రారంభించిన అనంతపురం జట్టు మొదటి ఇన్నింగ్స్‌లో 38.2 ఓవర్లలో 128 పరుగులకు అన్ని వికెట్లు కోల్పోయింది. ఆ జట్టులోని ఆదినారాయణ రెడ్డి 44, సాత్విక్ 38 పరుగులు చేశారు. చిత్తూరు జట్టులోని దినేష్ అద్భుతంగా బౌలింగ్ ప్రదర్శించి ఆరు వికెట్లు తీసుకున్నాడు. తేజస్ రెండు, నిహాల్ మాలిక్ రెండు వికెట్లు తీసుకున్నారు. అనంతరం బ్యాటింగ్ ప్రారంభించిన చిత్తూరు జట్టు మొదటి ఇన్నింగ్స్‌లో 50.5 ఓవర్లలో 184 పరుగులకు అన్ని వికెట్లు కోల్పోయింది. ఆ జట్టులోని మహమ్మద్ షారిక్ అక్తర్ 81 పరుగులు చేశాడు. అనంతపురం జట్టులోని దేవాన్ష్ నాలుగు, కిరణ్ కుమార్ నాలుగు వికెట్లు తీసుకున్నారు.

కెఒఆర్ఎం క్రికెట్ మైదానంలో ప్రారంభమైన కడప, నెల్లూరు మ్యాచ్ ఉత్కంఠగా సాగుతుంది. టాస్ గెలిచిన కడప జట్టు ఫీల్డింగ్ ఎంచుకుంది. తొలుత బ్యాటింగ్ ప్రారంభించిన నెల్లూరు జట్టు మొదటి ఇన్నింగ్స్‌లో 29.3 ఓవర్లలో 78 పరుగులకు అన్ని వికెట్లు కోల్పోయింది. కడప జట్టులోని కశ్యప్ రెడ్డి 5, గైబు 5 వికెట్లు తీసుకున్నారు. అనంతరం బ్యాటింగ్ ప్రారంభించిన కడప జట్టు మొదటి ఇన్నింగ్స్‌లో 38.4 ఓవర్లలో 140 పరుగులకు అన్ని వికెట్లు కోల్పోయింది. ఆ జట్టులోని లోకేష్ 55 పరుగులు చేశాడు. నెల్లూరు జట్టులోని సుశాంత్ 3, చైతన్య 3 వికెట్లు తీసుకున్నారు. అనంతరం రెండవ ఇన్నింగ్స్ ప్రారంభించిన నెల్లూరు జట్టు ఆట ముగిసే సమయానికి 19.0 ఓవర్లలో మూడు వికెట్ల నష్టానికి 73 పరుగులు చేసింది. కడప జట్టులోని గైబు మూడు వికెట్లు తీసుకున్నాడు



ప్రయాణికులకు అవగాహన కల్పిస్తున్న ఆర్‌పిఎఫ్ అధికారులు

పిల్లల అక్రమ రవాణాను అరికట్టాలి

ప్రజాశక్తి-రైల్వేకోడూరు

పిల్లల అక్రమ రవాణాను అరికట్టాలని ఆర్‌పిఎఫ్ ఎస్ఐ బి.నాగ భూషణం అన్నారు. సోమవారం హెడ్ కానిస్టేబుల్ పివిడి.నాయుడు, రెడ్స్ ఎన్‌జిఒ కో-ఆర్డినేటర్ రవీంద్రనాథ్ సిబ్బందితో కలిసి కడప రైల్వేస్టే షన్‌లోని ప్లాట్‌ఫామ్‌పై ప్యాసింజర్లకు కడప నుండి రైల్వేకోడూరు వరకు కన్యా కుమారి ఎక్స్‌ప్రెస్ రైలు, రైల్వేకోడూరు నుండి కడప వరకు ముంబై ఎక్స్‌ప్రెస్ రైలులోని ప్రయాణికులకు పిల్లల అక్రమ రవాణాదారుల పట్ల జాగ్రత్తగా ఉండా లని సూచించారు. అటువంటి వారు ఎవరైనా కనబడితే వెంటనే 1098, 18001027 222, 08662470966 నంబర్లకు సమా చారం అందించి పిల్లల అక్రమ రవాణా నుండి కాపాడాలని కోరారు. పోస్టర్ల, బ్యానర్లు ద్వారా ప్రయాణికులకు అవగాహన కల్పించామన్నారు. కార్యక్రమంలో ఉమ్మడి కడప జిల్లాలో కౌన్సిలర్ మణి, సిఎస్‌డబ్ల్యులు కీర్తివర్ధన్, నిర్మల, నాగమునేమ్మ పాల్గొన్నారు.

అనుచిత వ్యాఖ్యలపై పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు

ప్రజాశక్తి-రామాపురం

ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుపైనా, మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డిపై అనుచిత వ్యాఖ్యలు చేసిన వైసిపి నాయకులు రమేష్‌కుమార్‌రెడ్డిపై చర్యలు తీసుకోవాలని స్థానిక పోలీస్ స్టేషన్‌లో సోమవారం మండల టిడిపి నాయకులు గాలివీటిసురేంద్ర రెడ్డి, చంద్రమౌళి ఆధ్వర్యంలో టిడిపి నాయకులు, కార్యకర్తలు ఫిర్యాదు చేశారు. ఆదివారం చిన్నమండెం మండలంలో నిర్వహించిన వైఎస్‌ఆర్సిపి కార్యకర్తల సమావేశంలో ఆర్.రమేష్ కుమార్ రెడ్డి మంత్రి మండపల్లి రాంప్రసాద్ రెడ్డిని దొంగ అని సంబోధించారని, ఇది మంత్రి వ్యక్తిగత ప్రతిష్టకు భంగం కలిగే విధంగా ఉందని, దీనివల్ల నాయకులు, కార్యకర్తల మనోభావాలు దెబ్బతిన్నాయని ఫిర్యాదులో పేర్కొన్నారు తమ మనోభావాలు దెబ్బతిన్నాయని రమేష్ కుమార్‌రెడ్డిపై చట్టరీత్యా చర్య తీసుకోవాలని ఫిర్యాదులో పేర్కొన్నారు. కార్యక్రమంలో దేవదర్శన్ రెడ్డి, రామకృష్ణ గౌడ్, సి బాబు, సాగర్ రెడ్డి, సూరం శివారెడ్డి, పట్టాభి రెడ్డి, డేరంగుల శీను,. చిట్టి రెడ్డయ్య, టి. కృష్ణ, వెంకటరమణ, మల్లికార్జున పాల్గొన్నారు.

అంతర్జాతీయ స్థాయిలో 'శ్రీసాయి' విద్యార్థి ప్రతిభ

ప్రజాశక్తి - రాయచోటి

పట్టణంలోని లోని శ్రీ సాయి ఇంజినీరింగ్ కళాశాల (అటానమస్) విద్యార్థి అంతర్జాతీయ స్థాయిలో ఘనత సాధించాడు. ఈ సందర్భంగా కళాశాల అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ ఎం. సుధాకర్ రెడ్డి మాట్లాడుతూ ఈ విద్యాసంస్థలో కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజినీరింగ్ విభాగంలో ఎం.టెక్ చదువుతున్న ఎస్. మహమ్మద్ అఫ్జల్, ప్రఖ్యాత ఫెడరల్ బ్యాంక్ (ఇంటర్నేషనల్) సంస్థ నిర్వహించిన కఠినమైన ఎంపిక ప్రక్రియలో ప్రతిభ కనబరచి, ఐటి ఆఫీసర్‌గా ఉద్యోగానికి ఎంపికయ్యారని పేర్కొన్నారు. రూ. 12.54 లక్షల వార్షిక వేతనం అందుతుందని వివరించారు. ఇది మా కళాశాల విద్యార్థుల సత్తాను చాటే మరో మైలురాయి అన్నారు. అఫ్జల్ ఎంతో కృషితో, నైపుణ్యాలతో, ఎంపిక ప్రక్రియలో పాల్గొని ఈ విజయాన్ని సాధించారని తెలియజేశారు .ఫెడరల్ బ్యాంక్ నిర్వహించిన టెక్నికల్, ఇంటర్వ్యూ, గ్రూప్ డిస్కషన్ వంటి అనేక దశలను విజయవంతంగా అధిగమించి ఈ అవకాశాన్ని అందిపుచ్చుకున్నారని తెలిపారు. ఈ విజయానికి కళాశాల నిర్వహణ, ఉపాధ్యాయుల సూచనలు, ప్రోత్సాహమే ప్రధాన కారణమని, ప్రతి విద్యార్థికి అర్హతను పెంచేలా మౌలిక సదుపాయాలు, అర్థమెటిక్, కమ్యూనికేషన్ స్కిల్స్, రీజనింగ్ అంశాలపై ప్రత్యేక శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. కేవలం సిలబస్ నెరవేర్చడమే కాకుండా విద్యార్థుల్లో ఉద్యోగ నైపుణ్యాలు పెంపొందించే లక్ష్యంతో కళాశాల ముందుకు సాగుతుందని వివరించారు.ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ వి. బాలాజీ, వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ వి. వెంకటరమణ, ట్రైనింగ్ అండ్ ప్లేస్‌మెంట్ అధికారి కొత్తపల్లి ఇంతియాజ్, కంప్యూటర్ సైన్స్ విభాగాధిపతి శుభహాన్, ఇతర విభాగాల అధిపతులు, అధ్యాపకులు మహమ్మద్ అఫ్జల్‌ను హృదయపూర్వకంగా అభినందించారు. ఈ విజయం ఇతర విద్యార్థులకు ప్రేరణగా నిలుస్తుందని, అంతర్జాతీయ స్థాయిలో తమ కళాశాల పేరు మళ్లీ వినిపించేందుకు ఇది ఒక శుభపరిణామమని తెలిపారు.

అన్నమాచార్యలో వ్యక్తిత్వ వికాసంపై సదస్సు

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

అన్నమాచార్య విశ్వవిద్యాలయంలో సోమవారం బిటెక్ చివరి సంవత్సరం విద్యార్థులకు 'మైండ్ మేనేజ్‌మెంట్ ఫర్ బెట్టర్ ఫ్యూచర్' అనే అంశంపై ప్రత్యేక వ్యక్తిత్వ వికాస సదస్సును నిర్వహించారు. ఈ సదస్సును అన్నమాచార్య కమ్యూనిటీ రేడియో స్టేషన్ 89.6 ఎఫ్‌ఎం, హైదరాబాద్ రామకృష్ణ మఠం సంయుక్తంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య వక్తగా రామకృష్ణ మఠం స్వామి బోధమయానందాజీ మహారాజ్ హాజరై విద్యార్థులకు చైతన్యాన్ని అందించారు. మనస్సు నిబద్ధతతో నడిపితే జీవిత విజయం సాధ్యమవుతుందని., జ్ఞానం, నియంత్రణ, ధ్యానం జీవితాన్ని గెలవడానికి మార్గం చూపుతాయని వివరించారు. విద్యార్థులు జీవిత పరిపక్వతకు, లక్ష్య సాధనకు మైండ్ మేనేజ్‌మెంట్ ఎంత అవసరమో ఆకర్షణీయంగా వివరించారు. విశ్వవిద్యాలయ వైస్ చాన్సలర్ డా.సాయి బాబా రెడ్డి విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ ఆధ్యాత్మికతతో కూడిన వ్యక్తిత్వ వికాస సదస్సులు విద్యార్థుల జీవితాల్లో కీలకంగా మారతాయని తెలిపారు. ప్రిన్సిపల్ ఎస్.ఎం.వి. నారాయణ మాట్లాడుతూ ప్రతి విద్యార్థి అద్భుతమైన భవిష్యత్తును కలిగి ఉండాలంటే ముందు మనస్సును క్రమబద్ధీకరించుకోవాలన్నారు. మనసును ఎవరైతే సమర్థంగా నిర్వహిస్తారో వారు జీవితంలో విజేతలవుతారని పేర్కొన్నారు. ఆలుమ్ని కో- ఆర్డినేటర్, అన్నమాచార్య రేడియో 89.6 స్టేషన్ డైరెక్టర్ డా.కాశిగారి ప్రసాద్ స్వామి బోధమయానందాజీకి ధన్యవాదాలు తెలిపారు.

క్రైం కార్నర్



స్మగ్లర్లు, దుంగలు, వాహనాలతో టాస్క్‌ఫోర్స్ అధికారులు

9 మంది ఎర్రచందనం స్మగ్లర్లు అరెస్టు

- 16 దుంగలు స్వాధీనం

ప్రజాశక్తి-రైల్వేకోడూరు

బాలపల్లి ఫారెస్ట్ రేంజ్‌లో 9 మంది ఎర్రచందనం స్మగ్లర్లను అరెస్టు చేసినట్లు టాస్క్‌ఫోర్స్ ఆర్ఐ కె.కృపానంద తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ ఎఆర్ ఎస్ఐ బాల చెన్నయ్య, ఎఫ్‌బిఒ సుబ్బలక్ష్మి బృందం దేశెట్టిపల్లి ఫారెస్ట్ బీట్ పరిధిలో కూమ్మింగ్ నిర్వహిస్తూ బాలుపల్లి అటవీ ప్రాంతానికి చేరుకున్నారని తెలిపారు. అక్కడ కొందరు వ్యక్తులు రెండు కార్లలో కనిపించారని వారిని ట్రాన్స్‌పోర్ట్ పోలీసులు చుట్టుముట్టగా పారిపోయేందుకు ప్రయత్నించారని చెప్పారు. ఆ సమయంలో టాస్క్‌ఫోర్స్, పోలీసులు 9 మందిని అదుపులోకి తీసుకున్నారని తెలిపారు. పట్టుబడ్డ వారిలో నంద్యాల, అన్నమయ్య జిల్లాలు, కర్ణాటకకు చెందిన వారుగా గుర్తించామన్నారు. వాహనాలలో లోడ్ చేసిన 16 ఎర్ర చందనం దొంగలను స్వాధీనం చేసుకొని తిరుపతిటాస్క్‌ఫోర్స్, పోలీసుస్టేషన్‌కు తరలించామని చెప్పారు. డిఎస్‌పిలు వి.శ్రీనివాస్‌రెడ్డి, షరీఫ్ విచారించారన్నారు. ఎస్ఐ రఫీ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారని తెలిపారు.